TELUGU NEWS INTERNATIONAL
అంతర్జాతీయ తెలుగు వార్తా వేదిక
WWW.TNILIVE.COM

# TNILIVE-కిలారు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికాలో విద్యావకాశాలపై సదస్సు

అమెరికాలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం అక్కడ విద్యను అభ్యసిస్తున్న తెలుగు విద్యార్థుల స్థితిగతులపైన, అక్కడి ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలపైన కృష్ణాజిల్లా తిరువూరులో కిలారు ఫౌండేషన్–TNILIVE.COM సంయుక్త ఆధ్వర్యంలో ఒక సదస్సును నిర్వహించారు. స్థానిక శ్రీ వాహినీ ఇంజనీరింగ్ కళాశాల్లో నిర్వహించిన ఈ సదస్సుకు తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, అమెరికాలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డా.లక్కిరెడ్డి హనిమిరెడ్డి, తానా కార్యదర్శి తాతా మధు, అట్లాంటాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ నిపుణుడు సునీల్ షావిలి, ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రసంగించిన అతిథులు అమెరికాలో ప్రస్తుతం తెలుగు విద్యార్థులు ఉద్యోగాలకోసం గడ్డు పరిస్థుతలను ఎదుర్కొంటున్న మాట వాస్తవం అని వెల్లడించారు. ప్రతిభ కలిగిన వారికి పెద్దగా కష్టాలు ఉండకపోవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో అమెరికా వచ్చే విద్యార్థులు అక్కడ పరిస్థితులను అంచనా వేసుకోవాలని మంచి విశ్వవిద్యాలయంలో సీట్ వస్తేనే అమెరికా వెళ్లాలి తప్ప అమెరికాపై మోజుతో వెళితే మాత్రం కష్టాలు ఎదుర్కోక తప్పదు అని పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న విద్యార్థులు, ఉద్యోగులకు సహకరించడానికి తానా తరుపున హెల్ప్ లైన్ ఏర్పాటు చేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఏ దేశాధ్యక్షుడైనా ముందుగా ఆ దేశ ప్రజల ప్రయోజనాలను కాపాడాలని చూస్తారని, ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ కూడా అదే ప్రయత్నం చేస్తున్నారని కాకపోతే ట్రంప్ ధోరణి దూకుడుగా ఉండటం మూలంగా మిగిలిన దేశాల వారు ఆందోళన చెందుతున్నారని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉద్యోగాల్లో ఉన్న విదేశీలకు ఇబ్బందులు ఉండకపోవచ్చునని పేర్కొన్నారు. కిలారు ఫౌండేషన్–TNILIVE.COM ఆధ్వర్యంలో తిరువూరులో నిర్వహించే 'నెలనెల తెలుగు వెన్నెల' కార్యక్రమాన్ని రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభించారు. తిరువూరు వార్తల కోసం రూపొందించిన TVRNEWS.COM అంతర్జాల పత్రికను డా.లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రారంభించారు. TNILIVE.COM సంచాలకుడు కిలారు ముద్దుకృష్ణ, శ్రీ వాహిని ఇంజనీరింగ్ కళాశాల చైర్మెన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, కిలారు ఫౌండేషన్ డైరెక్టర్, స్థానిక Z.P.T.C. సభ్యురాలు కిలారు విజయబిందు తదితరులు పాల్గొన్నారు.